ఈ వారం కథ

# కోరిక

కాండ్రేగుల శ్రీనివాసరావు

వంటిమీదున్న పంచెలాల్చీని ఓసారి పరిశీలనగా చూసుకుంటూ ఇంట్లోంచి బయటకు అడుగుపెట్టారు అరవై ఏళ్ళ సీతారామయ్యగారు.

అప్పటిదాకా గోడ చాటున తాపీగా సిగరెట్ కాల్చుకుంటున్న డ్రైవర్ అతన్ని చూడగానే సిగరెట్ క్రింద పడేసి, కాలితో నలిపేసి, వడివడిగా రెండడుగులు వేసి అతన్ని అనుసరించాడు.

'సార్! కారు తీయమంటారా?' అడిగాడు వినయంగా.

'అవసరం లేదు. వెళ్ళేది లైబ్రరీకే! నడిచే వెళ్తాను' హుందాగా అడుగులు వేసుకుంటూ సాగిపోయేరాయన.

బైక్ మీద ఇంటికొస్తున్న కొడుకు, రోడ్డు మీద నడచి వెళ్తున్న తండ్రిని చూసి వేగాన్ని తగ్గించాడు 'కూర్చోండి నాన్నా! దింపి వేస్తాను' అన్నాడు.

'వద్దులేరా! నువ్వెళ్ళు. ఎక్కడికో కాదులే. ఇక్కడే లైబ్రరీకి. అన్నట్టు రాత్రి తొమ్మిది పదింటికల్లా వచ్చేస్తాలే!' ముందుకు కదిలేరాయన.

'నాన్నా! భుజం దగ్గర లాల్చీ చిరిగింది. మరోహాటి వేసుకోలేక పోయారా?' చిన్నగా అతనికి మాత్రమే వినిపించినట్లు అడిగాడు కొడుకు.

'అలాగా! చూళ్ళేదు. సర్లే నువ్వెళ్ళు'

తెలిసిన వాళ్ళు దారి పొడుగునా నమస్కరిస్తూంటే చిరునవ్వుతో ప్రతి నమస్కారాలు చేస్తూ బస్టాప్ వైపు సాగిపోయేరాయన.

తనకి కావాల్సిన బస్సు రాగానే అటువైపు కదిలారు. బస్సు ఎక్కే దగ్గర తోపులాటలో నిలదొక్కుకోవటం అలవాటు లేకపోవటంవల్ల కాస్త అవస్థలు పడి ఎలాగో ఎక్కేశారు.

'ఇక్కడ కూర్చోండి సార్!' ఓ యువకుడు లేచి తన సీటుని ఇచ్చేశాడు. ఆయన వద్దంటున్నాసరే వినకుండా.

సీతారామయ్యగార్ని మరెవరో పలకరించారు.

'కారు ఏమైంది సార్? బస్సులో వస్తున్నారు'

'కారు... కారు... ఆ... మావాడు తీసుకెళ్ళాడు. అందుకే బస్సులో వెళ్తున్నాను' చెప్పారాయన.

బస్సు ముప్పై కిలోమీటర్లు ప్రయాణించేక తన స్టాప్ రావటంతో దిగిపోయేరాయన. బస్సు ముందుకు సాగిపోయాక ఓసారి లాల్చీని సవరించుకుని చేతి గడియారం వైపు చూశారు. ఐదు ముప్పై...

సమయం కావొస్తూంది అనుకుని అటువైపు అడుగులు వేశారు.

నిజానికి వెళ్ళేది లైబ్రరీకే అయితే ఇంత దూరం రానవసరం లేదు. కావాలనే తను అబద్ధం చెప్పాడు.

పట్టణ పరిసర ప్రాంతంలోగల ఓ మోస్తరు సినిమా హాలు అది.

ఏదో పాత సినిమా ఆడుతోంది.

సీతారామయ్యగారు లోపలికి నడిచారు.

అక్కడున్న గేట్‌మేన్ ఆయన వంక ఎగాదిగా చూసి 'ఎవరు కావాలి సార్?' అడిగాడు. తన యజమాని గురించి వచ్చిన బాపతు అయి ఉంటుందేమోనన్న సంశయంతో.


'సినిమా చూట్టానికి. ఎన్నింటికి వేస్తారు?' అడిగాడాయన.

'ఆరింటికి. ఇంకా టైముంది. అక్కడ కూర్చోండి' వచ్చినతను తన యజమాని గురించి కాదని తెలిసాక కాస్త నిర్లక్ష్యంగా చెప్పాడు వాడు.

సీతారామయ్యగారు ఆ కుర్రాడు చూపించిన అరుగు దగ్గరకు నడిచారు. అరుగు మీద ధూళి పేరుకుపోయి ఉంది. పిట్టలు వేసిన రెట్టలు తెల్లని మచ్చలుగా మారి అక్కడక్కడా అగుపిస్తున్నాయి. రుమాలుతో కాస్త శుభ్రం చేసుకుని కూర్చున్నారాయన. రుమాలుని దులిపి జేబులో పెట్టుకుంటూ భుజమ్మీద చిరుగును చూసుకుని నవ్వుకున్నారు.

అంతకన్నా చిరుగులుగల పాతలాల్చీ తన దగ్గర లేదు. ఉన్న వాటిలో వెతికి వెతికి కావాలనే వేసుకున్న సంగతి వాడికి తెలియదు మరి. తనలో తాను మళ్ళీ నవ్వుకున్నారు.

కాసేపటికి సినిమా హాలు వాళ్ళు టికెట్ ఇస్తున్నామని సూచనప్రాయంగా బెల్ మ్రోగించారు. ఉన్న కొద్దిమంది టికెట్లు తీసుకుంటూ ఆదరాబాదరాగా థియేటర్లోనికి నడిచారు.



సీతారామయ్యగారు లేవలేదు. అలా అందరూ లోపలికి వెళ్ళిపోయాక బుకింగ్ దగ్గర రద్దీ తగ్గాక లేచి నిల్చున్నారాయన.

అతని మనస్సంతా ఉద్విగ్నంగా ఉంది. అలవికాని ఆనందం ఆవహిస్తూ మైమరపింపజేస్తోంది.

బుకింగ్‌లో చేయి పెట్టి 'ఓ మూడు రూపాయల టికెట్ ఒకటి ఇస్తావా బాబూ!' అడిగారాయన. యధాలాపంగా డబ్బులు తీసుకోబోతున్న బుకింగ్ క్లర్క్ టికెట్ కోసం చాచిన చేతికున్న ఉంగరాల్ని, ఆనక బయట ఉన్న మనిషిని చూసి గతుక్కుమన్నాడు. తను విన్నది పొరపాటు ఏమో అనుకుని 'ఏ టికెట్ కావాలి సార్?' మళ్ళీ అడిగాడు.

'మూడు రూపాయల టికెట్ నాయనా' చెప్పారాయన.

'మీ బోటి వాళ్ళు ఆ చెక్కబల్లల మీద కూర్చోలేరు సార్. క్లాసు తీసుకోండి'

'నాకు దూరం నుంచి సరిగా అగుపించదు నాయనా! పర్లేదు ఇవ్వు' అబద్ధం చెప్పారు.

'ఏవిటో సినిమా హాళ్ళు ఆర్థిక సంక్షోభంలోనికి పోతున్నాయి అంటే పోవా మరి? అతనేమిటి? ఆ ఠీవీ? మూడు రూపాయల టిక్కెట్టేవిటి?' సణుక్కుంటూ టికెట్ ఇచ్చాడు.

సీతారామయ్యగారు థియేటర్‌లోనికి నడిచారు. వరుస మధ్యలో ఫ్యాను గాలి తగిలేచోట చతికిలపడ్డారు. జారబడటానికి ఏం లేదు. అయినా సరే అలాగే కూర్చున్నారాయన.

తెర చాలా దగ్గరగా ఉంది. అంత దగ్గరగా తెరని చూడటం కొన్నేళ్ళ తర్వాత మళ్ళీ ఇదేనేమో . అలా చూస్తూ ఉంటే బాల్యం గుర్తొస్తోంది. అవి బహుశా రెండో తరగతి చదివే రోజులు కావచ్చు. తమ వూళ్ళో టూరింగ్ టాకీసు ఇసుకలో తెర ముందు కూర్చోవటం, జీళ్ళూ – పప్పుండలు, జొన్నపొత్తులు లాంటి చిరుతిళ్ళు తినటం గుర్తొచ్చాయి. మనస్సంతా హాయిగా అనిపించింది.

మళ్ళీ బెల్ మోగింది.

తెర మీద స్వాగతం అక్షరాలు పడ్డాయి. రెండు మూడు అడ్వర్టైజ్‌మెంట్ రీళ్ళు అయ్యాక సినిమా మొదలైంది.

అంత దగ్గరగా వీక్షించటం సీతారామయ్యగారికి ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది. క్రమంగా సినిమాలో లీనమైపోయారాయన. ఇంటర్వెల్‌లో బయటకు పోలేదు. అలాగే కూర్చోని ఉండటంవల్ల నడుం కాస్త సలుపుతూనే ఉంది. వెనక్కి చేయిపెట్టి వెన్ను మీద చిన్నగా చరుచుకున్నారు.

మళ్ళీ సినిమా ఆరంభమైంది. ముప్పావుగంట ఆట గడిచాక సినిమా పతాక సన్నివేశానికి చేరింది. జనం అందరూ ఉత్సుకతతో చూస్తున్నారు.

సీతారామయ్యగారు చుట్టుపక్కల వారిని పరిశీలించారు. పతాక సన్నివేశంలో అంతా లీనమై పోయి ఉన్నారు.

అవును. ఇదే మంచి సమయం. తన కోరిక తీర్చుకోవటానికి ఇదే మంచి తరుణం అని నిశ్చయించుకున్నారాయన. అనుకున్నదే తడవుగా మెల్లగా లేచి బల్లమీద నిల్చున్నారు. ఆయనను ఎవరూ గమనించలేదు. తన అరచేతిని చాచి ప్రొజెక్టర్ నుంచి తెర వైపు వస్తున్న కాంతికి అడ్డంగా ఉంచారు. ఆ చేతి నీడ తెర మీద పడింది. దాన్ని చూడగానే సీతారామయ్యగారికి చెప్పనలవి కాని ఆనందం కలిగింది. పసిపిల్లాడి మాదిరి మళ్ళీ మళ్ళీ చేస్తూ ఆనందించారాయన.

కాసేపటికి సినిమా ముగిసింది.

జనం అందరితోపాటు సీతారామయ్యగారు కూడా బయటకు నడిచారు. ఆయన ముఖం దేదీప్యమానంగా వెలిగిపోతూంది.

తీరని చిన్నచిన్న కోర్కెలే మనసుని తీవ్రంగా వేధిస్తూంటాయి. ఎన్నాళ్ళు క్రితం నాటి కోరికో, ఇన్నేళ్ళూ తనని వేధిస్తూ ఈనాటికి తీరింది. తన వయసు, హోదా, అంతస్తు, అన్నిటినీ ఈ కాసేపు విడిచిపెడితే గానీ తెర ముందు సినిమా చూస్తూ, అరచేతిని అడ్డం పెట్టడమనే చిన్ని కోరిక అందుబాటులోకి రాలేదు మరి!

★